


జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

సోమవారం 18 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 350 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు నాలుగు కేటగిరీలు కమిటీ తొలి సమావేశంలో కీలక నిర్ణయాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం కమిటీ చైర్మన్ కేశవరావు నేతృత్వంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు ప్రభుత్వం అధికారికంగా కమిటీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. అమరవీరుల జ్యోతి కింద ఉన్న కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమరవీరుల గుర్తింపుపై త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి ప్రతిపాదనలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, 1969 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల జేఏసీ, సబ్బండ వర్గాల జేఏసీ, కుల సంఘాలు, న్యాయవాదుల జేఏసీతో పాటు వివిధ జిల్లాల్లో ఏర్పడిన ఉద్యమ సంఘాల నుండి అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు. ఉద్యమకారుల కమిటీ జిల్లాల పర్యటనలు నిర్వహించి ప్రజల అభిప్రాయ సేకరణ చేపట్టాలని నిర్ణయించింది. ఉద్యమకారులను గుర్తించేందుకు నాలుగు కేటగిరీల ప్రతిపాదనలు సిద్ధం చేసిన కమిటీ, ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి మొదటి ప్రాధాన్యత, గాయపడిన వారికి రెండో కేటగిరి, జైలుకు వెళ్లినవారు, అరెస్టయినవారు, ఉద్యమ కేసులు ఎదుర్కొన్నవారిని మూడో కేటగిరిగా, క్షేత్రస్థాయిలో ఉద్యమం చేసిన వారిని నాలుగో కేటగిరిగా గుర్తించాలని ప్రతిపాదించింది. నాలుగో కేటగిరిలో ఎంపిక కోసం ఉద్యమ సమయంలో ప్రచురితమైన పత్రికా కత్తిరింపులను పరిశీలించాలని సూచించింది. పౌర సమాజంలో ఉండి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారి అభిప్రాయాలు కూడా తీసుకోవాలని నిర్ణయించింది. 1969, 1972, 1996 ఉద్యమకారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రతిపాదనలు స్వీకరించనుంది. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కాపాడేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశామని, రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల ఎంపిక జరుగుతుందని కమిటీ స్పష్టం చేసింది. గత ప్రభుత్వంలో కొంతమందికే సహాయం అందిందని, ఇకపై పార్టీలకు అతీతంగా అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిటీ అభిప్రాయపడింది. ప్రస్తుతం కేరళ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి వచ్చిన వెంటనే కమిటీ ప్రతిపాదనలపై ఆయనతో సమావేశమై చర్చించాలని నిర్ణయించారు.



## సరస్వతి అంత్య పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను మంత్రి కొండా సురేఖ కలిసి ఆహ్వానించారు. జూబ్లీహిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు ముఖ్యమంత్రికి పుష్కరాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సరస్వతి అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, శ్రీ శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ఈవో మహేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్రీడా, యువజన వారోత్సవాలు ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న యువజన, క్రీడా వారోత్సవాలు నేడు ఘనంగా ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఉదయం నిర్వహించే కార్యక్రమానికి క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొననున్నారు. కార్యక్రమంలో భాగంగా మెగా జుంబా, ఐదు కిలోమీటర్ల వాక్‌థాన్, యోగా, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎల్‌బీ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే వాక్‌థాన్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం, బురుగుల రామకృష్ణారావు భవనం, ఈగల్ సర్కిల్, ఆర్బీఐ, అసెంబ్లీ కంట్రోల్ రూమ్ మీదుగా ఎల్‌బీ ఇండోర్ స్టేడియం వరకు కొనసాగనుంది. ఈ వాక్‌థాన్‌లో సుమారు రెండు వేల మంది యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. అనంతరం ఎల్‌బీ ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులు, మహిళలు, వృద్ధుల కోసం ప్రత్యేక యోగా, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాల్లో యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం, ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాలను రూపొందించింది. కార్యక్రమానికి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే టి రాజాసింగ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, సురభి వాణీదేవి, ఏవీఎన్ రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

## రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలు ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం మే 18 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను వైభవంగా నిర్వహించనుంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ, పురావస్తు శాఖ, నిథమ్ సంస్థల సమన్వయంతో ఈ ఉత్సవాలను చేపడుతున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొననున్నారు. సోమవారం ఉదయం జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్లు, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రి, సాయంత్రం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని స్టేట్ మ్యూజియంలో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కొలనుపాక, అలంపూర్ సైట్ మ్యూజియం బ్రోషర్లతో పాటు 'టూరిస్ట్ గైడ్ ఇన్ తెలంగాణ' పోస్టర్‌ను ఆవిష్కరించనున్నారు. తెలంగాణ పర్యాటక రంగంలోని అపార అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడం, ఎకో టూరిజాన్ని ప్రోత్సహించడం, యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం వారోత్సవాల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. వారోత్సవాల్లో భాగంగా హెరిటేజ్ వాక్‌లు, పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు, సోషల్ మీడియా ప్రచారాలు, జిల్లా స్థాయి అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతితో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో జానపద కళాప్రదర్శనలు, పేరిణి నృత్యం, శాస్త్రీయ నృత్యాలు, సాహిత్య కార్యక్రమాలు, సంగీత కచేరీలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలోని రామప్ప దేవాలయం, నాగార్జునసాగర్, బుద్ధవనం, అలంపూర్ జోగులాంబ ఆలయం, లక్నవరం చెరువు, బొగత జలపాతం వంటి పర్యాటక ప్రాంతాలను ప్రత్యేకంగా ప్రోత్సహించనున్నారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా మే 23న హైదరాబాద్‌లో 'డెస్టినేషన్ తెలంగాణ: స్ట్రాటజీస్ ఫర్ ది నెక్ట్స్ ఫ్రంటియర్ ఆఫ్ టూరిజం' అనే అంశంపై ప్రతిష్టాత్మక టూరిజం కాన్క్లేవ్-2026 నిర్వహించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## ఐరాస వేదికగా నౌకలపై దాడులను ఖండించిన భారత్



సందేశం టైమ్స్, అంతర్జాతీయ, మే 18, ప్రతినిధి: అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకలు, సిబ్బందిపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి వేదికగా మాట్లాడిన భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ హర్మ్యాజ్ జలసంధి ప్రాంతంలో భద్రతా పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య నౌకలు మరియు నౌకా సిబ్బందిని లక్ష్యంగా చేసుకోవడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి దాడులు ప్రపంచ ఇంధన సరఫరా గొలుసుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలిగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ జలాల్లో ప్రయాణ స్వేచ్ఛను కాపాడటం అన్ని దేశాల బాధ్యత అని భారత్ పేర్కొంది. సముద్ర భద్రత, అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ విషయంలో ప్రపంచ దేశాలు సమన్వయంతో పనిచేయాలని భారత్ ఐక్యరాజ్యసమితి (United Nations) వేదికగా కోరింది.

## గ్రీనాథాన్-2026లో వేలాది మంది పరుగులు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న గ్రీనాథాన్-2026 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ వద్ద గ్రీనాథాన్-2026 రన్ ఫర్ బయోడైవర్సిటీ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు కార్యదర్శి కాళీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 21కే, 10కే, 5కే, 3కే మారథాన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సైనా నెహ్వాల్, ప్రముఖ రెజ్లర్ షంకీ సింగ్ పాల్గొనగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అతిథిగా హాజరయ్యారు. జీవ వైవిధ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ గ్రీనాథాన్‌లో సుమారు ఐదు వేల మంది రన్నర్లు పాల్గొని సందడి చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పిలుపునిచ్చారు.

## అబుదాబి బరాకా అణు విద్యుత్ కేంద్రం సమీపంలో డ్రోన్ దాడి




సందేశం టైమ్స్, అంతర్జాతీయ, మే 18, ప్రతినిధి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబి సమీపంలోని బరాకా అణు విద్యుత్ కేంద్రం పరిసరాల్లో డ్రోన్ దాడి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో కేంద్రం వెలుపల ఉన్న విద్యుత్ జనరేటర్ వద్ద మంటలు చెలరేగినట్లు సమాచారం. అయితే అణు రియాక్టర్ల భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని, రేడియేషన్ స్థాయిలు సాధారణంగానే ఉన్నాయని యూఏఈ అణు నియంత్రణ సంస్థ స్పష్టం చేసింది. కేంద్రంలోని అన్ని యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడికి ఇప్పటివరకు ఏ సంస్థ కూడా బాధ్యత వహించలేదు. ఘటనపై అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (International Atomic Energy Agency) ఆందోళన వ్యక్తం చేస్తూ, అణు కేంద్రాల సమీపంలో సైనిక చర్యలు జరగడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించింది.

# భగీరథ్ కేసు తెలంగాణ పోలీసుల పరిధిలోనే విచారణ: కిషన్‌రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: భగీరథ్ వ్యవహారంపై కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి స్పందిస్తూ ఈ కేసు పూర్తిగా తెలంగాణ రాష్ట్ర పోలీసుల పరిధిలోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, భగీరథ్ స్వయంగా పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. బండి సంజయ్ మంత్రి పదవిలో కొనసాగుతారా లేదా అన్న అంశంపై తాను వ్యాఖ్యానించలేనన్నారు. గతంలో పశ్చిమ బెంగాల్ పర్యటన సందర్భంగా అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్‌లను అక్కడి పోలీసులు అడ్డుకున్న ఘటనను ప్రస్తావించిన కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వాలకు చట్టపరమైన స్వతంత్ర అధికారాలు ఉంటాయని పేర్కొన్నారు. భగీరథ్ వ్యవహారంలో కూడా పోలీసులు చట్టప్రకారం అవసరమైన విధంగా విచారణ చేపట్టవచ్చని తెలిపారు.



# పుల్కల్ మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 18, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలోని పుల్కల్ మండల కేంద్రంలో తాగునీటి సమస్య నివారణకు మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు రెండు లక్షల రూపాయల నిధులతో బోరు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని 11, 12 వార్డుల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ చర్యలు చేపట్టినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు ఉదయ్, పుల్కల్ సర్పంచ్ భర్త కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ ప్రవీణ్, వార్డు సభ్యులు నరేందర్, శారద, రాములు, మంగలి రాజు, మన్నె విట్టల్, అబిక్, భాస్కర్, శ్రీనివాస్, మేతరి శ్రీనివాస్, కుమ్మరి గిరిధర్, బుచ్చ గౌడ్, ఇస్మాయిల్, మైలార్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# భార్యతో వివాహేతర సంబంధం అడ్డొస్తున్నాడని భర్త హత్య.. ఇద్దరు అరెస్ట్



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 18, బి. డేవిడ్: పటాన్చెరు పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను హత్య చేసిన ఘటనను సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. మాదాపూర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, చైతన్య నగర్‌కు చెందిన శేఖర్ (36) భార్య ప్రమీల (27)తో అతని స్నేహితుడు నవీన్ (24)కు వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం తెలిసిన శేఖర్ భార్యను మందలించడంతో పాటు నవీన్‌ను హెచ్చరించాడు. దీంతో శేఖర్‌ను అడ్డుగా భావించిన నవీన్, మే 15న అతన్ని హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ప్రమీల పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడంతో పాటు నవీన్‌కు సమాచారం అందించినట్లు తేలింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రమీల, నవీన్ ఇద్దరినీ అరెస్ట్ చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# సింఫనీ పార్క్ హోమ్స్ స్థలాలను పరిరక్షిస్తాం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 18, బి. డేవిడ్: పటాన్చెరు డివిజన్ పరిధిలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీకి చెందిన స్థలాలను ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షిస్తామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులకు భరోసా కల్పించారు. కాలనీ ఏర్పాటు సమయంలో అవసరాల కోసం ఆరు వేల గజాల స్థలాన్ని బిల్డర్ కేటాయించగా, అనంతరం స్వార్థపూరితంగా కొందరికి అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై హైకోర్టు స్టే ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు భూమిని తమదిగా పేర్కొంటూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం సింఫనీ పార్క్ హోమ్స్ కమ్యూనిటీ హాల్‌లో గృహ యజమానులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీ అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం చట్టవిరుద్ధమని, చట్టప్రకారం ఆ స్థలం కాలనీకి చెందుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా బలవంతంగా ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాలనీవాసులు అధైర్యపడవద్దని, ఎల్లప్పుడూ తమ సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆంజనేయస్వామి దేవాలయాన్ని పునర్నిర్మించడంతో పాటు రామాలయం, శివాలయం, అమ్మవారి దేవాలయాలను సొంత నిధులతో నిర్మిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# సాకే చెరువు వద్ద పసికందు లభ్యం



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 18, బి. డేవిడ్: పటాన్చెరు పట్టణంలోని సాకే చెరువు సమీపంలో 17 రోజుల మగ శిశువును వదిలిపెట్టిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు గమనించి వెంటనే డయల్-100కు సమాచారం అందించగా పటాన్చెరు పోలీసులు స్పందించి పసికందును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం శిశు గృహ అధికారులకు సమాచారం ఇచ్చి, మెరుగైన సంరక్షణ కోసం బాబును సంగారెడ్డికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. శిశువును అక్కడ వదిలివెళ్లిన వారిపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు.



# మురుగునీటి కాలువ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 18, బి. డేవిడ్: బీరంగూడ డివిజన్ పరిధిలో మురుగునీటి కాలువల దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్‌తో కలిసి కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే అనంతరం కాలనీవాసులతో సమావేశమై సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజుల్లో బండరాళ్లను పూర్తిగా తొలగించి కాలువను శుభ్రపరచాలని జీహెచ్ఎంసీ ఇరిగేషన్ ఏఈ గులాంకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, యూజీడీల నిర్మాణం కోసం రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నెల 23న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. సమస్యను వెంటనే పరిష్కార దిశగా తీసుకెళ్లిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ సురేష్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సయ్యద్ ఖాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాచూర్ రావు



సందేశం టైమ్స్, వట్పల్లి, మే 18, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలానికి చెందిన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సయ్యద్ ఖాజాకు ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక సందేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహకు విశ్వాసపాత్రుడిగా గుర్తింపు పొందిన ఖాజా చిన్న వయసులోనే రాజకీయ రంగంలో మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. పార్టీ పట్ల అంకితభావం, స్వీయ గౌరవం, సానుకూల దృక్పథం, సహనం, వినమ్రత, నాయకత్వ లక్షణాలు ఆయన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని కొనియాడారు. భవిష్యత్తులో మరింత స్ఫూర్తిదాయక నాయకుడిగా ఎదిగి మంచి ఆరోగ్యంతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సందేశం టైమ్స్, మెదక్, మే 18, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో జూన్ 15 నుంచి 24 వరకు సన్నాహక శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సందర్శనలు చేపట్టనుండగా, జూలై 24న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి, సెప్టెంబర్ 28లోపు పరిష్కరించిన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రజల సందేహాల నివృత్తి, సమాచారం కోసం 9553866388 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

# వాయిలసింగవరంలో ఉచిత న్యూరో వైద్య శిబిరం నిర్వహణ



సందేశం టైమ్స్, అనంతగిరి, మే 18, ప్రతినిధి: అనంతగిరి మండల పరిధిలోని వాయిలసింగవరం గ్రామంలో వినూత్న న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత న్యూరో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు, యస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 130 మంది గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెల ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు కోరారు. ఈ సందర్భంగా న్యూరో ఫిజిషియన్ డాక్టర్ పి హరికిరణ్ మాట్లాడుతూ మెదడు, వెన్నుముక, నరాల సమస్యలు, పక్షవాతం, ఫిట్స్, తలనొప్పి, తిమ్మిర్లు, మతిమరుపు వంటి వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, దాములూరి మురళి, బుర్రా నాగమల్లేశ్వరరావు, నేరెళ్ల సైదులు, మేళ్లచెర్వు నాగేంద్రతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులదే: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్, మే 18, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: చక్కటి విద్యాబుద్ధులు నేర్పించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మెదక్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారోత్సవాల్లో జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలు, విద్యాశాఖ సాధించిన ప్రగతిపై డీఈఓ రాజు నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అదనపు కలెక్టర్ విద్యార్థి దశ జీవితంలో కీలకమని, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. పదవ తరగతి తర్వాత ఎంచుకునే విద్యా మార్గం భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఇష్టమైన సబ్జెక్టులతో ఉన్న కోర్సులను ఎంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అపజయాలకు కుంగిపోకుండా పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్లకు బానిస కాకుండా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. తల్లిదండ్రులు బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించి ఉన్నత స్థానాలకు చేరేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, మెరుగైన విద్యా బోధన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీయం అల్పాహార పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించి ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుదర్శన్ మూర్తి, సీఎంఓ రాజు, ఏఎస్వో నవీన్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్ నగేష్

సందేశం టైమ్స్, మెదక్, మే 18, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు దేశ భవిష్యత్తు ప్రణాళికా రూపకల్పనలో జనగణన అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. హవేలీఘనాపూర్ మండలం బైతోలే గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన అనంతరం హెచ్‌పీబీ నంబర్-38 పరిధిలో జరుగుతున్న జనగణన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు వేగవంతంగా తరలించి దిగుమతి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచుకోవాలని ఆదేశించారు. అనంతరం జనగణన ప్రక్రియలో భాగంగా ఇంటింటికి వెళ్తున్న ఎన్యూమరేటర్లతో మాట్లాడి వివరాల నమోదు విధానాన్ని తెలుసుకున్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు సమాచారాన్ని కచ్చితంగా సేకరించాలని ఆదేశించారు. స్వాతంత్ర్యం తర్వాత ఇది 16వ జనగణన అని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి జనగణన ఇదేనని తెలిపారు. ఈసారి తొలిసారిగా డిజిటల్ విధానంలో సర్వే నిర్వహిస్తూ ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే 'స్వీయ గణన' విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వజ్రోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న మామిడి ప్రదర్శన

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 18, ప్రతినిధి: సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రంలో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకల్లో ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచి అధిక ఆదాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ రకాల మామిడి పండ్లను ప్రదర్శించగా మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల నుండి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోందని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబించి నాణ్యమైన దిగుబడులు సాధిస్తే విదేశాలకు ఎగుమతులు చేసి అధిక లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఫల పరిశోధన కేంద్రం ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల నాణ్యమైన మొక్కలను రైతులకు అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# డిజిటల్ జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, మే 18, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి: జనగణన ప్రక్రియలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. డిజిటల్ జనగణన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ దంపతులు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకుని ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ జనగణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ప్రొవిజనల్ మార్గదర్శకాల ప్రకారం తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధి ప్రణాళికలకు ఎంతో కీలకమని, ప్రతి పౌరుడికి ఇందులో భాగస్వామి కావాల్సిన బాధ్యత ఉందన్నారు. జనాభా గణన, గృహ జాబితా కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ సమయాన్ని ఆదా చేసుకుంటూనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఈ డేటా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

# విద్య వ్యక్తిత్వ వికాసంలో ప్రధాన పాత్ర వహిస్తుంది: ప్రిన్సిపల్ కృష్ణకుమార్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 18, ప్రతినిధి: తారా ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపిన వివరాల ప్రకారం, ఏడు రోజులపాటు యోగా, పేరెంట్-టీచర్ సమావేశాలు, వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు, కృత్రిమ మేధస్సుపై వర్క్‌షాప్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె. కృష్ణకుమార్ హాజరై మాట్లాడుతూ విద్య మాత్రమే కాదు, సమాజంపై అవగాహన, మానవతా విలువలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు కలిగినప్పుడే వ్యక్తి ఉన్నత పౌరుడిగా ఎదుగుతాడని తెలిపారు. లక్ష్యాలను సులభంగా సాధించగలిగే విధంగా నిర్ణయించుకోవాలని, నిరంతర కృషితోనే విజయాలు సాధ్యమని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం ద్వారా వ్యక్తి విలువ పెరుగుతుందని అన్నారు. అనంతరం ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న 11 మంది ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సర్టిఫికెట్లు, మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నిర్మల, డాక్టర్ జగదీశ్వర్, ఐక్యుఏసి కన్వీనర్ డాక్టర్ వాణి, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ అధికారులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్య విజయోత్సవంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 18, ప్రతినిధి: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా "విద్య విజయోత్సవం" కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యా, క్రీడా రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు పురస్కారం, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు, సిబ్బందిని కూడా ప్రత్యేకంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, అదనపు సంచాలకులు శంకర్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యాపేటలో ఘనంగా జిల్లాస్థాయి విద్యా విజయోత్సవం




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 18, ప్రతినిధి: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా సూర్యాపేటలో జిల్లాస్థాయి విద్యా విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ మరియు క్రీడా విభాగాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ ఘనంగా సత్కరించి ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక అవకాశాలను అందిపుచ్చుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యాశాఖను అభినందించిన కలెక్టర్, వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనీసం 10 శాతం కొత్త అడ్మిషన్లు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కే. అశోక్, డీఐఈవో సులోచన రాణి, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్ట వేద పాఠశాల శంకుస్థాపనకు ముఖ్యమంత్రిని ఆహ్వానం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పరిధిలో ఈ నెల 23న చేపట్టనున్న వేద పాఠశాల శంకుస్థాపనతో పాటు పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను ఆహ్వానించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, యాదగిరిగుట్ట దేవస్థాన అర్చక బృందం, ఉన్నతాధికారులు కలిసి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## కేబీఆర్ పార్క్‌కు నష్టం లేకుండా గ్రేడ్ సెపరేటర్ కారిడార్: జీహెచ్ఎంసీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన గ్రేడ్ సెపరేటర్ కారిడార్ ప్రాజెక్ట్‌పై జీహెచ్ఎంసీ ప్రత్యేక వీడియో విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్ వల్ల కేబీఆర్ పార్క్ ఎకో సెన్సిటివ్ జోన్‌కు ఎలాంటి నష్టం జరగదని అధికారులు స్పష్టం చేశారు. 'జీరో పార్క్ ఇంట్రూజన్' విధానంతో రోడ్డు మధ్య భాగాల్లోనే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్ట్ అమలులో కేబీఆర్ పార్క్‌లోని ఒక్క చెట్టును కూడా తొలగించబోమని జీహెచ్ఎంసీ పేర్కొంది. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ కాంక్రీట్ నిర్మాణాల బదులుగా స్టీల్ ఫ్లైఓవర్లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.




## ఫిల్మ్ ఛాంబర్‌లో కీలక సమావేశం.. పర్సంటేజీ విధానంపై సబ్‌కమిటీ ఏర్పాటు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 18, ప్రతినిధి: హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల మధ్య కీలక సమావేశం ముగిసింది. ఎగ్జిబిటర్ల సెక్టార్‌కు సంబంధించిన 'పర్సంటేజీ విధానం'పై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. సమస్యను వేగంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్‌కమిటీకి ప్రముఖ నిర్మాత డి సురేష్‌బాబు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కన్వీనర్లుగా అల్లు అరవింద్, దిల్ రాజుతో పాటు కే.ఎల్. నారాయణ, కె. అశోక్‌కుమార్లను నియమించారు. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ ఈ సబ్‌కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్) ఆధ్వర్యంలో జరిగింది. సినీ పరిశ్రమలో నెలకొన్న పర్సంటేజీ వివాదానికి ఈ కమిటీ త్వరలో పరిష్కారం చూపే అవకాశముందని భావిస్తున్నారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం.. ఐదుగురు దుర్మరణం

సందేశం టైమ్స్, అంతర్జాతీయ, మే 18, ప్రతినిధి: తమిళనాడులోని మదురై జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో కారులో ప్రయాణిస్తున్న వారంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా భావిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారం పథకం అమలు

సందేశం టైమ్స్, జగిత్యాల, మే 18, ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం పథకాన్ని అమలు చేయనున్నట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. జగిత్యాల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే సమాజ వికాసం సాధ్యమని పేర్కొన్న మంత్రి, జగిత్యాల జిల్లా పదో తరగతి ఫలితాల్లో 98.88 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో నాలుగో స్థానం సాధించిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లాలో పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.8 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.




## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై భారం: సజ్జల విమర్శ

సందేశం టైమ్స్, అమరావతి, మే 18, ప్రతినిధి: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రైతులు, రవాణా రంగం, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇంధన ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు మాటమార్చి ప్రజలపై అదనపు భారం మోపిందని ఆయన ఆరోపించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని పేర్కొన్న ఆయన, ధరల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం పునర్విమర్శించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఎబోలా వ్యాప్తిపై WHO హెచ్చరిక.. ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటింపు

సందేశం టైమ్స్, అంతర్జాతీయ, మే 18, ప్రతినిధి: ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (World Health Organization) అప్రమత్తత ప్రకటించింది. ఈ పరిస్థితిని ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన WHO, వైరస్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రస్తుతం డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (Democratic Republic of the Congo) మరియు ఉగాండా (Uganda) దేశాల్లో ఎబోలా కేసులు వేగంగా పెరుగుతున్నట్లు వెల్లడించింది. ఇప్పటివరకు 300కు పైగా కేసులు నమోదైనట్లు సమాచారం. ఎబోలా ఒక తీవ్రమైన వైరల్ వ్యాధి కాగా, ఇది శరీర ద్రవాల ద్వారా వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాపిస్తుందని, జ్వరం, వాంతులు, విరేచనాలు మరియు అంతర్గత రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. బాధిత ప్రాంతాల్లో వైద్య బృందాలు, పరీక్షలు, క్వారంటైన్ చర్యలను ముమ్మరం చేసినట్లు WHO తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.